News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :198 | ఖమ్మం | సోమవారం, ఆగస్టు 24, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## ములుగులో మహిళా నాయకత్వానికి
# కష్టకాలమేనా.?



- "రెండు జిల్లాల్లో సంచలనం సృష్టిస్తున్న బి.ఆర్.ఎస్ నాయకురాలు పుర్రె, స్వరూప వ్యాఖ్యలు."
- "నూతన నేతలతో.. బలోపేతం కానున్న కారు పార్టీ?"
- "అసలు ములుగులో నిలబడే ఆ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు.?
- "కీలక నేతల చేరికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ.."
- " ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపై బీ.ఆర్.ఎస్ ప్రత్యేక దృష్టి?"
- "ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో కొత్త వ్యూహమా?"
- "కారు పార్టీలో హోదా కోసం పోరా..? "లేక" పార్టీ బలోపేతం కోసం సర్దుబాట.?"
- "ములుగు--భద్రాద్రిలో కారు జెండా ఎగరాలనే లక్ష్యమా?"
- "వెన్నుపోటు' నేతలకు మళ్లీ అవకాశం ఉంటుందా?"
- "నేతల చేరికలతోనే బలం పెరుగుతుందా?"
- "రాబోయే ఎన్నికలే అసలు పరీక్ష!"

వివరాలు 8లో..




## కేసు నుంచి తప్పించండి
# ఎంతైనా ఇస్తాం!

- జనసేన ఎంపీ లింగమనేని కుమారుడు సంజూష్ యాక్సిడెంట్ చేసిన కేసులో పోలీసులతో భారీ మొత్తంలో సెటిల్‌మెంట్
- నిందితుడి కుటుంబం, మాదాపూర్ ఠాణాలో ఓ ఉన్నతాధికారి ఒకే సామాజిక వర్గం కావడంతో సయోధ్య
- అందుకే ఘటన జరిగిన ఐదు రోజులపాటు దాచిపెట్టిన పోలీసులు
- ఎఫ్ఐఆర్‌లో అనుకూల సెక్షన్ల నమోదుపై అధికారులపై రాష్ట్ర పోలీసు బాస్ ఆగ్రహం
- నేడు పోలీసులకు చేరనున్న ఎంవీఐ సమగ్ర నివేదిక



హైదరాబాద్

జనసేన ఎంపీ లింగమనేని రమేష్ కుమారుడు సంజూష్ యాక్సిడెంట్ చేసిన కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేసు నుంచి తప్పిస్తే ఎంత పెద్ద మొత్తమైనా ఇస్తామని పోలీసులతో చెప్పినట్లు తెలిసింది. మాదాపూర్ ఠాణాలో ఓ ఉన్నతాధికారి, లింగమనేని కుటుంబం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో భారీ మొత్తంలో సెటిల్‌మెంట్ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 16న హైదరాబాద్‌లో ఇనార్బిట్ మాల్ వద్ద లింగమనేని సంజూష్ తన ఆస్టన్ మార్టిన్ లగ్జరీ కారులో అతివేగంగా దూసుకొచ్చి రోడ్డు దాటుతున్న లైఫ్‌స్టైల్ స్టోర్ ఉద్యోగిని భారతీ ముఖిని ఢీకొట్టడంతో ఆమె మృతి చెందిన సంగతి తెలిసిందే. పోలీసులు ఐదు రోజులపాటు ఈ రోడ్డు ప్రమాదం విషయాన్ని

వివరాలు 2లో..



## పార్లమెంట్ సమావేశాలు ముగియలేదు, వాయిదానే వేశారు

- కీలక బిల్లు ఆమోదం కోసమేనా? తెర వెనక ఏం జరుగుతోంది?
- ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన ఉభయ సభలు
- పది రోజులు గడిచినా జారీ కాని ప్రొరోగ్ ఉత్తర్వులు
- మహిళా రిజర్వేషన్ అమలుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు చర్చ

# అధిష్టానం వద్దకు 'కొండా' పంచాయితీ

- సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకోనున్న ముందు రోజే ఆమె ఏఐసీసీ అధ్యక్షుడితో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం
- అన్ని విషయాలపై వివరణ
- దాదాపు 15 నిమిషాలపాటు ఇద్దరి భేటీ
- సీఎం వచ్చాక మాట్లాడుదామని, మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్‌లతో క్షుణ్ణంగా చర్చించాక ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని ఖర్గే చెప్పినట్టు సమాచారం.



హైదరాబాద్

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ అధికారికంగా కాంగ్రెస్ అధిష్టానం వద్దకు చేరింది. ఆదివా రం మధ్యాహ్నం ఆమె బెంగళూరుకు వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. దాదాపు 15 నిమిషాలపాటు ఇద్దరి భేటీ జరిగిందని సమాచారం. అయితే బెంగళూరుకు వెళ్లి ఖర్గేను కలిసిన విషయంలో మంత్రి సురేఖ గోప్యత పాటించడం.. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకోనున్న ముందు రోజే ఆమె ఏఐసీసీ అధ్యక్షుడితో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ఖర్గేను కలిసిన సందర్భంగా మంత్రి సురేఖ రాష్ట్రంలో జరుగుతున్న అన్ని

వివరాలు 2లో..

# మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం!

- కేంద్రం హామీలపై సీజేపీ కీలక భేటీ
- కేంద్రం ఇచ్చిన హామీల అమలుపై సోమవారం సీజేపీ సమీక్ష
- ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, పరిహారం అంశాల్లో పురోగతి లేదని ఆరోపణ



# కేసు నుంచి తప్పించండి 'ఎంతైనా ఇస్తాం'!



-మొదటిపేజీ తరువాయి

బయటికి పొక్కనివ్వకుండా గోప్యంగా ఉంచారు. ఇందులో భాగంగానే నిందితుడు సంజూష్ స్థానంలో మరొక ప్రైవేట్ డ్రైవర్‌ను పెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే అప్పటికే ఘటనాస్థలిలో స్థానికులు ఫోన్‌లో రికార్డ్ చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఈనెల 21న మీడియాకు లీకులు ఇచ్చారు. అందుకే అతివేగం, నిర్లక్ష్యంగా కారు నడిపి రోడ్డు దాటుతున్న పాదచారి భారతీ మృతికి కారణమైన తీవ్రమైన రోడ్డు ప్రమాదంలో కూడా పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. నిందితుడు సంజూష్‌ను వెంటనే అరెస్ట్ చేయకుండా, నోటీసులతో సరిపెట్టేశారు. స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేశారు. కేవలం బీఎన్ఎస్ 106(1) కింద అనుకూల సెక్షన్ నమోదు చేశారు. కారుతో ఢీకొట్టి మరణానికి కారణమైన కేసులో మోటారు వాహన చట్టం కింద కేసులు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### పోలీసు బాస్ సీరియస్

ఆర్థిక, రాజకీయ పలుకుబడి ఉన్న లింగమనేని రమేష్ కుమారుడు కావడంతోనే సంజూష్‌పై అనుకూల సెక్షన్లు నమోదు చేశారంటూ పోలీసులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారాన్ని రాష్ట్ర పోలీసు బాస్ సీరియస్‌గా తీసుకున్నారు. శనివారం మాదాపూర్ పీఎస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ), దర్యాప్తు అధికారి ఎస్ఐను కార్యాలయానికి పిలిపించుకొని కేసు నమోదు, దర్యాప్తు తీరు తదితరాలపై సమగ్ర వివరాలను సేకరించినట్లు తెలిసింది. కారు వేగం, తీవ్రమైన గాయాలతో భారతీ మృతి చెందిన తీరు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఎలాంటి సెక్షన్లు జోడించాలో తెలియదా? లేదా ఎవరి ఒత్తిడి, ప్రలోభాల వల్ల అనుకూల సెక్షన్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

### రెట్టింపు వేగంతో ఢీ కొట్టి..

ఇప్పటికే జిల్లా రవాణా అధికారి (డీటీఓ) ఘటనాస్థలిని సందర్శించారు. నిందితుడు లింగమనేని సంజూష్ నడిపిన అస్టన్ మార్టిన్ లగ్జరీ స్పోర్ట్స్ కారు (టీజీ09 జీ0666)ను స్వాధీనం చేసుకొని వాహన తనిఖీని పూర్తి చేశారు. రోడ్డు దాటుతున్న భారతీని కారు ఎడమ వైపు బలంగా తాకడంతో ఆమెకు తల, శరీర భాగాలకు తీవ్రమైన గాయాలయ్యాయని, అలాగే కారు ఎడమ వైపు బాగా డ్యామేజ్ అయినట్లు గుర్తించారు. భారతీని ఢీకొట్టిన తర్వాత కారును పక్కన నిలిపి, ఆపేయడంతో కారు వేగం స్పీడోమీటర్‌లో నమోదు కాలేదు. అలాగే ఘటనాస్థలం వద్ద ఎలాంటి సీసీటీవీ కెమెరాలు గానీ స్పీడో మీటర్లు గానీ లేకపోవడంతో కారు వేగాన్ని అధికారులు అంచనా వేయలేకపోయారు. అయితే మృతిరాలి తలకు, శరీర భాగాలకు తగిలిన గాయాలను బట్టి కారు 80 కిలోమీటర్ల వేగంతో ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇనార్బిట్ మాల్ వంటి రద్దీగా ఉండే నగర రోడ్లపై కార్ల సగటు నిర్దేశిత వేగం 40 కి.మీ.గా ఉండాలి. కానీ, సంజూష్ హైఎండ్ స్పోర్ట్స్ కారుతో మిట్ట మధ్యాహ్నం, బిజీ రోడ్డులో రెట్టింపు వేగంతో కారు నడపడం తీవ్రమైన నేరం కిందకి వస్తుంది. కారు చెట్టు, డివైడర్ వంటి బలమైన వాటికి ఢీకొడితే కారులోని బెలూన్స్ తెరుచుకునే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

### కొత్త సెక్షన్ల జోడింపు

కారు నడిపిన లింగమనేని సంజూష్ ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ సమర్పించాలని పోలీసులను డీటీఓ కోరారు. సోమవారం చేతిరాతతో రాసిన సమగ్ర నివేదిక కాపీని దర్యాప్తు అధికారికి అప్పగిస్తామని సంబంధిత అధికారి 'సాక్షి'కి తెలిపారు. అనంతరం మోటారు వాహన తనిఖీ (ఎంవీఐ) నివేదిక పరిశీలన తర్వాత సంజూష్‌పై కొత్త సెక్షన్లు జోడించే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి చెప్పారు. ఘటన తీవ్రత దృష్ట్యా బీఎన్ఎస్‌తోపాటు మోటారు వాహన చట్టం కింద కూడా కేసు నమోదు చేసే అవకాశం ఉందని చెప్పారు.

### సులువుగా బెయిల్ వచ్చేలా కేసు

నిందితుడు సంజూష్‌పై మాదాపూర్ పోలీసులు కేవలం బీఎన్ఎస్ 106 (1) సెక్షన్ కింద మాత్రమే కేసు నమోదు చేశారు. అంటే అజాగ్రత్త లేదా నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగిన సాధారణ ప్రమాదంగా దీన్ని పరిగణిస్తారు. ఇది పూర్తిగా బెయిలబుల్ నేరం. దీని కింద గరిష్టంగా ఐదేళ్లలోపు శిక్ష పడే అవకాశం ఉన్నప్పటికీ.. నిందితుడికి పోలీస్ స్టేషన్ నుంచి లేదా కోర్టుకు వెళ్లిన వెంటనే సులువుగా బెయిల్ లభిస్తుంది. అయితే హైస్పీడ్ కారును బిజీ పబ్లిక్ ఏరియాలో నడుపుతున్నప్పుడు దాని వల్ల ఎదుటివారి ప్రాణాలు పోతాయని తెలిసి కూడా నిర్లక్ష్యంగా వాహనం నడిపినట్టు ఆధారాలు ఉంటే బీఎన్ఎస్ 105 సెక్షన్‌ను ఎఫ్ఐఆర్‌లో చేర్చాలి. ఈ సెక్షన్ కింద (మరణం సంభవించే అవకాశం ఉందని తెలిసి చేసిన చర్య అయితే..) పదేళ్ల వరకు జైలు, జరిమానా కూడా విధించే అవకాశం ఉంటుంది. మోటార్ వాహన చట్టం 184 సెక్షన్ చేర్చడం కూడా కీలకమే. ఈ సెక్షన్ ప్రకారం ప్రజలకు ప్రమాదకరంగా ఉండే వేగంతో లేదా డేంజరస్ డ్రైవింగ్‌గా పరిగణిస్తారు. కానీ ఈ సెక్షన్‌ను ఎఫ్ఐఆర్‌లో నమోదుచేయలేదు.

# 12వ వేతన ఒప్పందమేది?.. కార్మిక కుటుంబాల్లో ఆందోళన

**పెద్దపల్లి,** : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కార్మికులకు కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా యాజమాన్యం 12వ వేతన ఒప్పందంపై తీవ్ర జాప్యం చేస్తున్నాయి. 1 జూలై 2026 నుంచి అమల్లోకి రావాల్సిన వేతన ఒప్పందంపై ఇంతవరకు చర్చలే ప్రారంభించకపోవడంపై కార్మికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. గడువు ముగిసినప్పటికీ జాయింట్ బై పార్టీ కమిటీ ఫర్ కోల్ ఇండస్ట్రీస్ (జేబీసీసీఐ) వేతన స్థిరీకరణ కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో రాష్ట్రంలోని 45 వేల మంది కార్మికులు, ఉద్యోగుల కుటుంబాల్లో ఆందోళన నెలకొన్నది. కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను అమలు చేస్తేనే వేతన చర్చలు అంటూ కోల్ ఇండియా యాజమాన్యం కాలయాపన చేస్తున్నది. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను సింగరేణిలోని టీబీజీకేఎస్, ఏఐటీయూ, ఐఎన్‌టీయూసీలు వ్యతిరేకిస్తున్నాయి. 1967 నుంచి ప్రతి ఐదేండ్లకోసారి సకాలంలో వేతన ఒప్పందం జరిగేది. లేబర్ కోడ్‌లతో సంబంధం లేకుండానే కేంద్రం కార్మిక సంఘాల ప్రతినిధులతో జేబీసీసీఐని ఏర్పాటు చేయాలని, లేకపోతే వచ్చే నెల 12న ఢిల్లీలో జాతీయస్థాయి కార్మిక సదస్సు నిర్వహించి కార్యాచరణ ప్రకటించాలని ప్రధాన సంఘాలు నిర్ణయించాయి. దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల కార్మికులకు అమలు చేయాల్సిన వేతనాలు, అలవెన్స్‌ను ఖరారు చేసేందుకు కేంద్రం, కోల్ ఇండియా కార్మికసంఘాలతో 1967 నుంచి జేబీసీసీఐ ఏర్పాటు చేసింది. 1వ వేజ్ బోర్డు 1 జనవరి 1975 నుంచి 31 డిసెంబర్ 1978 కాలాన్ని నిర్ణయించారు. 12వ వేజ్ బోర్డు 1 జూలై 2026 నుంచి అమల్లోకి రావాలి. జేబీసీసీఐ ఏర్పాటు చేసి, 12వ వేతన చర్చలు ప్రారంభించాలని, లేకుంటే సింగరేణి నుంచి జాతీయ స్థాయి వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి.



## రాయబారులుగా నిలవాలి

-మొదటిపేజీ తరువాయి

ధన్యవాదాలు అని సీఎం తన ట్వీట్?లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తీవ్రంగా ఖండించిందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ప్రవర్తిస్తోందని, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను ఇలా అడ్డుకోవడం దారుణమంటూ తనకు మద్దతుగా నిలిచారన్నారు. తనకు కొండంత అండగా నిలిచిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలపై మాట్లాడతా : అంతేకాకుండా, ఈ విషయంలో జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తనకు, తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలిచిన వివిధ రాజకీయ పార్టీల నేతలకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బోస్టన్ పర్యటన రద్దు కావడంతో కొన్ని గంటల్లోనే లండన్ నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. భాగ్యనగరానికి చేరుకున్న వెంటనే విదేశాంగ శాఖ నిర్ణయం, దానికి వెనుక ఉన్న రాజకీయం, పర్యటన వివరాలకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి సమాచారం వెల్లడిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు.

"విదేశీ పర్యటన అంశంలో నాకు మద్దతుగా నిలిచిన ఖర్గేకు కృతజ్ఞతలు
లండన్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్నాను. కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నాను. రాజకీయ కోణంలోనే నా అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. మరికొన్ని గంటల్లో హైదరాబాద్ వస్తున్నా. హైదరాబాద్‌కు వచ్చాక మిగిలిన అంశాలపై మాట్లాడతాను"– సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్

### లండన్‌లో తెలుగు ప్రవాసులతో సీఎం సమావేశం

ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లో తెలుగు ప్రవాసులకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ఉదయం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిపై ప్రవాసులతో వారు చర్చించారు. తెలుగు సమాజం ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసులు కూడా భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా బలంగా ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని కోరారు.

## మంత్రి పొన్నంతో చర్చలు సఫలం

-మొదటిపేజీ తరువాయి

తలపెట్టదలచిన సమ్మెను విరమిస్తున్నట్లు ఆటో కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ఆటో కార్మికుల సంఘాల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేయనుందన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని అవి కేవలం తప్పుడు ప్రచారమని ఆయన స్పష్టం చేశారు. కార్మిక, రవాణా, ఆటో కార్మికుల సంఘాల ప్రతినిధులతో సెప్టెంబర్ 1న సమావేశం నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. అలాగే ఆటో ఛార్జీల పెంపునకు వీలుగా ఉత్తర్వును జారీ చేయడానికి కూడా ప్రభుత్వం అంగీకరించిందని ఓలా, ఊబర్ తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక యాప్‌ను రూపొందించాలని నిర్ణయించిందని ఆయన తెలిపారు.

### ఆటో సంఘాల డిమాండ్లు ఇవే :

ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి.

ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలు పెంచాలి. ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్?లకు బదులుగా ప్రభుత్వమే ఒక కొత్త యాప్?ను తీసుకురావాలి. ఓలా, ఊబర్, ర్యాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న టూవీలర్లను నిషేదించాలి. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలి. ఆటో డ్రైవర్లకు ఈ-ఛలాన్ల నుంచి మినహాయింపు ఇవ్వాలి హైదరాబాద్ నగరంలో అక్రమంగా నడుస్తున్న ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలి వాహన సారథి పోర్టల్?లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కొనసాగించాలి రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్స్ జి.ఓ.ఎం.ఎస్ నం.60లో ఆటోలకు మినహాయించాలి

## అధిష్టానం వద్దకు 'కొండా' పంచాయితీ

-మొదటిపేజీ తరువాయి

పరిణామాలపై మాట్లాడినట్టు తెలిసింది. ఇటీవల పరకాలలో జరిగిన సభలో సీఎం ఏం మాట్లాడారు? ఆ తర్వాత తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు, తదనంతర పరిణామాలు, తనకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నోటీసులు, తానిచ్చిన సమాధానం, తనకు వ్యతిరేకంగా కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా పెట్టిన ప్రెస్‌మీట్, తనను వ్యక్తిగతంగా కించపరుస్తూ వారు మాట్లాడిన మాటలు, ఆ తర్వాత తాను రెండోసారి క్రమశిక్షణ కమిటీకి రాసిన లేఖ, గతంలో వరంగల్ జిల్లాలో జరిగిన గొడవలు, ఆ సందర్భంలో పార్టీ, సీఎం వ్యవహరించిన తీరు గురించి ఖర్గేకు ఆమె వివరించినట్టు తెలిసింది. అయితే సురేఖ చెప్పిన వివరణ విన్న ఖర్గే ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. సుస్మిత వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేసేవిధంగా ఉన్నాయి కదా అని ప్రశ్నించిన ఖర్గే.. సీఎం గురించి అలా మాట్లాడి ఉండాల్సింది కాదని అభిప్రాయపడినట్టు సమాచారం. అన్ని విషయాలు పార్టీ పరిశీలిస్తుందని, సీఎం వచ్చాక మాట్లాడుదామని, మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్‌లతో క్షుణ్ణంగా చర్చించాక ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని ఖర్గే చెప్పినట్టు సమాచారం.

### బీజేపీ చీఫ్ రాంచందర్‌రావుకు తారసపడిన సురేఖ

మంత్రి కొండా సురేఖ బెంగళూరు నుంచి తిరుగు ప్రయాణంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరువురూ పలకరించుకున్నారని, ఆ సమయంలోనే బెంగళూరు నుంచి వస్తున్నానని సురేఖ వెల్లడించారని సమాచారం.

# కాంగ్రెస్‌లో కష్టమే.. వేరే పార్టీలు చేర్చుకోవు!

**వరంగల్** : వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మొదటినుంచీ దూకుడు వైఖరి ప్రదర్శించే మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి కుటుంబం.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపైనే నేరుగా బహిరంగ తిరుగుబాటు బావుటా ఎగురవేయడం తెలంగాణ కాంగ్రెస్‌లో పెను ముసలానికి దారితీసింది. పరకాల పర్యటనలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీఎం పిలుపునిచ్చిన వెంటనే.. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ సీఎం రేవంత్‌పై తీవ్రమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. తల్లిదండ్రుల ప్రత్యక్ష ఆశీస్సులు, సంపూర్ణ రాజకీయ మద్దతు లేకుండా కేవలం ఒక కుమార్తెగా ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఇంతటి తీవ్రస్థాయి వ్యాఖ్యలు చేయడం అసాధ్యమని, ఇది పూర్తిగా కొండా దంపతుల వ్యూహాత్మక రాజకీయమే. ఈ దూకుడు వెనుక ఉన్న ప్రధాన కారణం పరకాల నియోజకవర్గంలో తమ పట్టును, వచ్చే తరం రాజకీయ వారసత్వాన్ని కాపాడుకునే తాపత్రయమే. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపిస్తూనే, తమ కుమార్తె సుస్మితను పరకాల నుంచి బరిలోకి దించాలన్న పట్టుదలతో కొండా కుటుంబం ఉంది. అయితే రేవంత్ రెడ్డి మాత్రం రేవూరి ప్రకాష్ రెడ్డికి పరోక్షంగా మద్దతు ప్రకటించడంతో కొండా వర్గంలో అభద్రతాభావం తారాస్థాయికి చేరింది. అధిష్ఠానాన్ని, సీఎంను తీవ్రస్థాయిలో బెదిరించి, ఒత్తిడి తీసుకురావడం ద్వారానే తమ రాజకీయ డిమాండ్లను సాధించుకోవచ్చనే పాత పంథానే వారు మళ్లీ నమ్ముకున్నట్లు కనిపిస్తోంది.

అయితే ఈ తరహా దూకుడు రాజకీయాలు కొండా కుటుంబ రాజకీయ భవిష్యత్‌కు చేటు తెచ్చే ప్రమాదం ఉంది. గతంలో వైఎస్సార్ మరణానంతరం వైఎస్సార్‌సీపీలోకి వెళ్లడం, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి అనుభవించి అక్కడా కేసీఆర్‌పై తిరుగుబాటు చేసి కాంగ్రెస్‌కు రావడం వంటి వరుస పార్టీ మార్పిడుల చరిత్ర వారికి ఉంది. క్రమశిక్షణారాహిత్యంతో సొంత ప్రభుత్వాలపైనే రచ్చకెక్కే నైజం ఉన్న నేతలను చేర్చుకోవడానికి విపక్ష బీఆర్ఎస్ లేదా బీజేపీ వంటి ఇతర పార్టీలు కూడా సుముఖంగా ఉండే అవకాశం లేదు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటే లేదా కేబినెట్ నుంచి తప్పిస్తే.. రాజకీయంగా ఒంటరిపాటు కావడం ఖాయమనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో కొండా కుటుంబం తీసుకుంటున్నది అత్యంత ప్రమాదకరమైన జూదమని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఉంటూనే సీఎం స్థాయి వ్యక్తిపై బరితెగించి ఆరోపణలు చేయడం వల్ల తాత్కాలికంగా మీడియా మైలేజ్ లభించినప్పటికీ, దీర్ఘకాలికంగా అది వారి రాజకీయ పునాదులకే గొడ్డలిపెట్టుగా మారే అవకాశం ఉంది.

### కొండా సురేఖ భవిష్యత్తు తేల్చేది ఆ లేఖేనా

సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సమయంలో మంత్రి కొండా సురేఖ స్వయంగా కల్పించుకుని, కూతురి వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సీఎంకు క్షమాపణలు చెప్పి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. అయితే, ఒకసారి పొరపాటు జరిగిందని సరిదిద్దుకున్న తర్వాత కూడా మళ్లీ అదే తరహాలో ముఖ్యమంత్రిపై బహిరంగ విమర్శలు చేయడం వెనుక గల ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరిగా కేవలం ఒక క్షమాపణ లేఖతో ఈ వివాదం సద్దుమణుగుతుందా? లేక అధిష్ఠానం కఠిన నిర్ణయాల దిశగా అడుగులు వేస్తుందా? అన్నది పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. క్రమశిక్షణ కమిటీకి సమర్పించే లేఖలో కొండా సురేఖ ఏ వైఖరి తీసుకుంటారనే అంశంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆమె ముందు ప్రధానంగా మూడు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకటి కూతురి వ్యాఖ్యలకు మద్దతు తెలపడం. కూతురు లేవనెత్తిన అంశాలను సమర్థిస్తే అది నేరుగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినట్లే అవుతుంది. ఇది మంత్రి పదవికి ముప్పు తెచ్చే ప్రమాదం ఉంది. రెండోది కూతురి వ్యాఖ్యలను ఖండించి క్షమాపణ కోరడం. కూతురి వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని తేల్చిచెప్పడం. తద్వారా అధిష్ఠానం ఆగ్రహం నుంచి తప్పించుకోవడం. మూడోది పరకాల రాజకీయాన్ని తెరపైకి తేవడం. కూతురి వ్యాఖ్యలపై పెద్దగా స్పందించకుండా, స్థానిక రాజకీయం, పరకాల నియోజకవర్గంలో తమ వర్గానికి జరుగుతున్న అన్యాయం, గ్రూపు రాజకీయాల వల్లే అసహనంతో ఈ వ్యాఖ్యలు వచ్చాయనే విషయాన్ని లేఖలో ప్రస్తావించడం. కొండా కుటుంబానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం, బలమైన క్యాడర్ ఉన్నాయి. అయితే, ప్రస్తుత అధికార కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రితో నేరుగా తలపడటం కొండా దంపతుల రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. క్రమశిక్షణ కమిటీకి ఇచ్చే వివరణ అసంతృప్తికరంగా ఉంటే అధిష్ఠానం ఎలాంటి కఠిన నిర్ణయానికైనా వెనుకాడకపోవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖ పంపే లేఖ ఈ వివాదానికి ముగింపు పలుకుతుందా, లేక కాంగ్రెస్ పార్టీలో సరికొత్త రాజకీయ సంక్షోభానికి నాంది పలుకుతుందా అనేది కొద్ది గంటల్లో తేలనుంది.

## పోల్కంపల్లి శివాలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు



సీకే న్యూస్ ప్రతినిధి,దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట్ మండలం పోల్కంపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 లక్షల నిధులతో చేపట్టనున్న శ్రీ శివాలయ పునర్నిర్మాణ పనులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (+వీ=) భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భద్రాద్రి సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.351 కోట్లు, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లు, కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధి పనులకు రూ.110 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధితో పాటు వాటి ప్రాచీన వైభవాన్ని కాపాడుతూ భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పోల్కంపల్లి శ్రీ శివాలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయడం గ్రామీణ ప్రాంత దేవాలయాల అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

అనంతరం గ్రామంలో హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే పలు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అర్హులైన వారు సదరం క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని, సర్పంచ్ వినతి,ఈనెల 25 నా, మెదక్ లో



ఆగస్టు 23 (సీ కే న్యూస్) చేగుంట :మెదక్ జిల్లాలో సదరం క్యాంపు నిర్వహించగా అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలీ, చేగుంట మండల్ గ్రామం పొలంపల్లి సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి తెలిపారు, సర్పంచ్ మాట్లాడుతూ

పొలంపల్లి గ్రామంలో అర్హులైన ఉన్న వారు ఈనెల 25 మంగళవారం నాడు మెదక్ లో సదరం క్యాంప్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం జరిగింది, కావున గ్రామ ప్రజలు వికలాంగులు పక్షవాతం, కాలు, చెయ్యి, కండ్లు కనిపించని వారందరూ మీ సేవలో ఆన్లైన్ దరఖాస్తు చేసుకొని సదరం క్యాంపుకు వెళ్ళాలి, రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించింది అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు, ప్రభుత్వం పెన్షన్ ఇచ్చే అవకాశాన్ని కల్పించింది కాబట్టి పొలంపల్లి గ్రామంలో అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలి, అర్హులైన ప్రతి ఒక్కరి పెన్షన్ వచ్చే అవకాశం ఉంటుంది, కాబట్టి అప్లై చేసుకునేవారు గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకి రాగలరు, సెక్రటరీ వెంకటేష్ పాలకవర్గ సభ్యులు అందుబాటులోనే ఉంటారని సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి తెలిపారు,

## కిసాన్ మోర్చా యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా కందుల తానేష్ గౌడ్ ఎన్నిక.




సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 23.

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న సంఘం గ్రామానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కందుల తానేష గౌడ్ ను.

కిసాన్ మోర్చా యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా.

మీడియా ద్వారా కందుల తానేష్ గౌడ్ మాట్లాడుతూ,

నా ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ గారికి రాష్ట్ర నాయకులకు వలిగొండ మండల పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు. పార్టీ అభివృద్ధికి అధిష్టానం మేరకు పని చేస్తానని అన్నారు.

# ప్రపంచ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో టేకులగూడెం మాతంగి ప్రవీణ్ కు,బంగారు పతకం.







సీకే న్యూస్ ఆగస్టు 23 ఆదివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్.ప్రపంచ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్‌షిప్, పోటీలలో జె.ఆర్.ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో అమికల్ స్పోర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ గచ్చిబౌలిలోని,జి.ఎం.సి.బాలయోగి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మూడవ రోజు పోటీలు అత్యంత ఉత్సాహంగా,మాతంగి.ప్రవీణ్ టేకులగూడెం,కాజీపేట్ మండల్ వరంగల్ జిల్లా తెలంగాణ రాష్ట్రం,ఇండియా,క్యోరుగి(స్పారింగ్) సీనియర్ బ్లాక్ బెల్ట్ అండర్ 54 వెయిట్ కేటగిరి విభాగంలో బంగారు పతకం సాధించారు.వీరిని గ్రాండ్ మాస్టర్ ఎం.జయంత్ రెడ్డి అభినందించారు.గ్రాండ్ మాస్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుండి రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది మంది సబ్–జూనియర్, కేడెట్, జూనియర్, సీనియర్ క్రీడాకారులు తమ అద్భుతమైన కిక్స్ పంచ్‌లతో మొదటి రోజే సత్తా చాటారు.ప్రతి విభాగంలోనూ హోరాహోరీ పోరుదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన యువ తైక్వాండో క్రీడాకారులు పతకాల కోసం,తీవ్రంగా,తలపడ్డారు.క్యోరుగి(స్పారింగ్) విభాగంలో క్రీడాకారులు చూపిన దూకుడు, చురుకుదనం ప్రేక్షకులను ఎంతగానో,ఆకట్టుకున్నాయి.ఆరంభం నుంచే ప్రతి రౌండ్‌లోనూ నువ్వా నేనా అన్నట్లుగా పోటీలు సాగాయి.నిర్వాహకులు టెక్నికల్ డైరెక్టర్, మేనేజర్,రాజు రాథోడ్, అఫీషియల్స్ పర్యవేక్షణలో మ్యాచ్‌లు నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా కొనసాగాయి.

## జిమ్నాస్టిక్స్‌లో జగన్నాధపురం చిన్నారి మనుశ్రీ ప్రతిభ.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన గంటెల ఈశ్వరరావు – గంగ దంపతుల కుమార్తె మనుశ్రీ జిమ్నాస్టిక్స్‌లో సత్తా చాటింది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాల్గొన్న మనుశ్రీ అద్భుతమైన ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి (సెకండ్ ప్రైజ్) సాధించి విజేతగా నిలిచింది.

చిన్న వయసులోనే జిమ్నాస్టిక్స్‌పై ఆసక్తి పెంచుకున్న మనుశ్రీ, క్రమం తప్పకుండా సాధన చేస్తూ తన ప్రతిభను మెరుగుపరుచుకుంటోంది. జిల్లా స్థాయి పోటీల్లో ఇతర క్రీడాకారులతో పోటీపడి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రెండో బహుమతి సాధించడం విశేషంగా నిలిచింది.లి

మనుశ్రీ సాధించిన ఈ విజయంతో జగన్నాధపురం గ్రామంలో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయసులోనే జిల్లా స్థాయిలో బహుమతి సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొన్నారు. మనుశ్రీ భవిష్యత్తులో మరింత కష్టపడి సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు, బహుమతులు సాధించాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.లి

మనుశ్రీ విజయానికి తల్లిదండ్రులు అందిస్తున్న ప్రోత్సాహం, ఆమె పట్టుదల, నిరంతర సాధన ప్రధాన కారణాలని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విజయంతో తమ కుమార్తెపై మరింత నమ్మకం పెరిగిందని, భవిష్యత్తులో ఆమెకు పూర్తి సహకారం అందిస్తామని తల్లిదండ్రులు తెలిపారు.

## తిరుమలాపురం వాసుల నూతన గృహప్రవేశ వేడుకలో సందడి.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని ఆగస్టు 23: చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన గోదా రవీందర్--సుజాత దంపతులు హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎస్ఎస్ పరిస్థిన్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌ను కొనుగోలు చేశారు. నూతన గృహంలో ఆదివారం కుటుంబ సభ్యుల సమక్షంలో గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన గృహంలో వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. గృహప్రవేశ వేడుకకు గ్రామానికి చెందిన గోగుల నరసింహారావు, బండి సైదులు, బండి తిరుపతిరావు, గోదా వెంకన్న, చింతల రామకృష్ణ, సువర్ణకంటినాగేశ్వరరావు, మరీదు భూపతిరావు, గోదా ప్రసాద్, మడిపల్లి రామకృష్ణ, గోగుల వెంకటేశ్వర్లు, మడిపల్లి పెంటయ్య, మడిపల్లి సైదులుతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొని రవీందర్--సుజాత దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన గృహంలో కుటుంబం ఆనందంగా, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## గిరిజన సంప్రదాయ బద్ధంగా వనభోజనశీ మహోత్సవం

ఎర్రకుంట తండా గ్రామ సర్పంచ్ భూక్య రవి నాయక్ చింతలపాలెం సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు మండల కేంద్రంలో ఉన్నఎర్రకుంట తండా గ్రామంలో బంజారా సాంప్రదాయ బద్ధంగా గిరిజన వాసులు ఘనంగా వనభోజన కార్యక్రమం జరుపుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ భూక్య రవి నాయక్ పాల్గొని బంజారా ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ మేరమ్మ యాడి కులదేవతలను వేడుకుని ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షం కురిసి పాడి పంటలు అష్ట ఐశ్వర్యాలు కలగాలని సేవాలాల్ మహారాజును వేడుకోవడం జరిగింది



ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ సర్పంచ్ భూక్య రవి బంజారా జేఏసీ నాయకుడు ధరావత్ నరసింహ గ్రామ కార్బరీ గుగులోతు గన్యా గ్రామ నాయక్ సైదా శంకర్ వార్డ్ నెంబర్ అయినా కోటేశ్వరరావు నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## ముత్యాలమ్మ తల్లి మురిసే వరుణుడు కరుణించే

- చింతకానిలో అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాల మహోత్సవం
- పాల్గొన్న చింతకాని సర్పంచ్ మరియు గ్రామ పెద్దలు



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాల మహోత్సవంవైభవంగా జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ మహిళా మణులు ఉత్సాహంగా పాల్గొని ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించడం జరిగింది. ఉదయం నుండి బ్యాండ్ మేళాలతో డీజే తో గ్రామపుర వీధుల్లో బోనాల ఊరేగింపు ఉత్సాహంగా చేస్తూ గ్రామ పొలిమేరలో ఉన్న ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ కార్యక్రమంలో చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు,ఉపసర్పంచ్ కోలా ఉమారాణి, గుడి చైర్మన్ యండపల్లి శ్రీనివాస్ పెద్ద కాపు బండి రమణ,బి ఆర్ స్ నాయకులు పోనుగోటి రత్నాకర్, కిలారు బాబురావు, కోలా నాగేశ్వరావు, గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జగన్నాధపురం గ్రామంలో ముత్యాలమ్మ బోనాలు



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. తెలంగాణ లోగ్రామ దేవతలను కొలిచే ముఖ్యమైన ఆధ్యాత్మిక సాంప్రదా యాలలో ఒకటి. ముత్యాలమ్మ అమ్మవారిని గ్రామానికి రక్షణగా ప్రజలు కు ఆరోగ్యం. సుఖ సంతోషాలు ప్రసాదించే తల్లిగా భక్తులు విశ్వసిస్తారు.

బోనాలు సందర్భంగా మహిళలు అలంకరించిన బోనం (అన్నం. పాలు. బెల్లం. తదితర నైవేద్యాలతో) తలపై మూసుకొని అమ్మవారికి సమర్పిస్తారు. డప్పుల మోత. పోతురాజుల నాట్యాలు. భక్తుల ఊరేగింపులతో పండగగా వాతావరణం నెలకుంటుంది. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ముత్యాలమ్మ బోనాలుసందర్భంగాలి: గ్రామ ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో. సుఖ సంతోషాలతో పాడిపంటలతో. అభివృద్ధి చెందాలని భక్తులు ముత్యాలమ్మ తల్లిని కోరుకుంటారు.

ఈ కార్యక్రమానికి: గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువత చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చొరవతో మంబాపూర్‌లో అభివృద్ధి పరుగులు

- రెండున్నరేళ్లలో రూ.1.15 కోట్లతో మంబాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులు
- రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు పరిష్కారం
- 328 ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం
- విద్యా మౌలిక వసతులకు రూ.21 లక్షల నిధులు
- విలేఖరుల సమావేశంలో మంబాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు



**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి , ఆగస్టు 23:** తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు పీటర్ యాదయ్య, ఉపాధ్యక్షులు జి.రాములు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో దశలవారీగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఆదివారం మంబాపూర్ గ్రామంలో ఇదివరకు గ్రామంలో జరిగిన వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాల పై విలేఖరుల సమావేశం నిర్వహించి పలు విషయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా పలు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ....

పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి కనీస మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.1.15 కోట్ల నిధులు వెచ్చించినట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**రోడ్లు, డ్రైనేజీకి భారీగా నిధులు**

మాంబాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.5 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు.6వ, 7వ వార్డుల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.10 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు.గోపాలకృష్ణ దేవాలయం సమీపంలో మరో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.అదేవిధంగా 5, 6వ వార్డుల్లో రూ.20 లక్షలు, 1, 2వ వార్డుల్లో రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. 3వ వార్డులో డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.4 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

**తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు**

9వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారం కోసం డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.1 లక్షతో కొత్త బోర్ మోటారులు ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

**పంచాయతీ, డ్వాక్రా భవనాలకు నిధులు**

గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి సుమారు రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.డ్వాక్రా మహిళల కోసం నూతన భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.మహిళలకు అవసరమైన కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు ఈ భవనం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

**విద్యకు ప్రాధాన్యం**

మంబాపూర్ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ం+జుఔ×ణజ నిధుల నుంచి సుమారు రూ.21 లక్షలతో నూతన సైన్స్ రూమ్ ను మంజూరు చేసినట్లు చెప్పారు.పాఠశాల రక్షణ కోసం ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

**328 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు**

తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మంబాపూర్ గ్రామానికి తొలి విడతలోనే 328 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం ఎమ్మెల్యేకు గ్రామ అభివృద్ధిపై ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని యాదయ్య తెలిపారు.పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో మంబాపూర్‌కు మొదటి ప్రాధాన్యత లభించిందని అన్నారు.అదేవిధంగా గ్రామంలోని అర్హులైన పేదలకు 150 నూతన రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు.ఆత్మీయ భరోసా పథకం కింద 84 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు.

**అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు**

మంబాపూర్ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు ప్రత్యక్షంగా గమనిస్తున్నారని, వాస్తవ పరిస్థితులు ప్రజలకు తెలుసని అన్నారు.బీఆర్ఎస్ నాయకులను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, గతంలో జరిగిన పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని వారు పేర్కొన్నారు.మంబాపూర్ అభివృద్ధికి అడ్డంకులు సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

**ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చొరవతో మరింత అభివృద్ధి**

మంబాపూర్ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారం కొనసాగించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.రాబోయే రోజుల్లో కూడా గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, విద్య, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర రంగాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు యాదయ్య, ఉపాధ్యక్షులు రాములు,ఖలీల్, మాజీ సర్పంచులు నారాయణ, శ్రావణ్ కుమార్, స్థానిక నాయకులు శ్రీనివాస్, ఇబ్రహీం, మంగలి పాండు, అంజి, ఏసు, విజయ్ కుమార్, చెన్నారం శ్యామ్, కుమ్మరి నర్సింహులు, తెర్పటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధిలో మరో అడుగు...వేగంగా సాగుతున్న పనులు

- విద్యకు బలమైన పునాది..పాఠశాలలో కొత్త తరగతి గదులులి
- పెద్దేముల్ లో విద్యా మౌలిక వసతులకు పెద్దపీట
- పెద్దేముల్ జెడ్పీ బాలుర పాఠశాలలో శరవేగంగా అదనపు తరగతి గదుల నిర్మాణం
- రూ.27 లక్షల సమగ్ర శిక్ష నిధులతో నిర్మాణ పనులు
- 2024 జూన్ 20న శంకుస్థాపన చేసిన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- గదులు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మరింత సౌకర్యవంతమైన విద్యాభ్యాసం



**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, ఆగస్టు 23:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదుల అవసరం ఉండటంతో ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించింది.ఇందులో భాగంగా విద్యా మరియు సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏడబ్ల్యూపీ అండ్ బీ 2023--24 సమగ్ర శిక్ష పథకం కింద రూ.27 లక్షల నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టారు.

**ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన**

పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి 2024 జూన్ 20న శంకుస్థాపన చేశారు.అనంతరం సంబంధిత శాఖల పర్యవేక్షణలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతుండటంతో త్వరలోనే అదనపు తరగతి గదులు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం**

అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయితే పాఠశాలలో విద్యార్థులకు మరింత అనుకూలమైన విద్యా వాతావరణం ఏర్పడనుంది.తరగతి గదుల కొరత తగ్గడంతో విద్యార్థులను తరగతుల వారీగా సౌకర్యవంతంగా కూర్చోబెట్టి బోధన నిర్వహించేందుకు ఉపాధ్యాయులకు అవకాశం కలుగుతుంది. విద్యార్థులు కూడా ప్రశాంతమైన వాతావరణంలో పాఠాలు వినేందుకు, చదువుపై మరింత శ్రద్ధ పెట్టేందుకు వీలు కలుగుతుంది.

**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం కూడా కీలకమని స్థానికులు పేర్కొంటున్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టడం ద్వారా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం పెరిగే అవకాశం ఉంది.

**పనుల పురోగతిపై ఆసక్తి**

రూ.27 లక్షల నిధులతో చేపట్టిన ఈ నిర్మాణ పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పనుల పురోగతిని ఆసక్తిగా గమనిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన అనంతరం అదనపు తరగతి గదులు అందుబాటులోకి వస్తే పాఠశాలలో విద్యార్థులకు ఉన్న స్థల సమస్య కొంతవరకు పరిష్కారం కానుంది.

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలని విజ్ఞప్తి**

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నాణ్యతపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి, పనులను నిర్ణీత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచిస్తున్నారు. అదే విధంగా నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు తరగతి గదులను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**విద్యాభివృద్ధికి మరో ముందడుగు**

పెద్దేముల్ మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయితే పాఠశాల మౌలిక వసతుల్లో మరో కీలక ముందడుగు పడనుంది. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు అందుబాటులోకి రావడం ద్వారా బోధన--అభ్యసన ప్రక్రియ మరింత సౌకర్యవంతంగా సాగనుంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేస్తూ నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

# రోడ్డుపై కంకర దిబ్బ.. వాహనదారులకు తప్పని తిప్పలు

**సీకే న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 23 2026:** ఏన్కూరు మండల పరిధిలోని ఎర్రబోడు తండా నుంచి శ్రీరాంపురం వరకు నూతనంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్, కంకరను తిమ్మారావుపేట నుంచి ముచ్చర్లకు వెళ్లే ప్రధాన రహదారిపై పోశారు. అయితే కంకరను పూర్తిగా పక్కకు తొలగించకుండా రోడ్డుకు సగం మేర దిబ్బగా ఉంచడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రధాన రహదారిపై సగభాగాన్ని ఆక్రమించేలా కంకర దిబ్బ ఉండటంతో వాహనాలు వెళ్లేందుకు మిగిలిన కొద్దిపాటి స్థలమే అందుబాటులో ఉంటోంది. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు కంకరను తప్పించుకునే క్రమంలో అదుపుతప్పే ప్రమాదం నెలకొంది.

ఇప్పటికే రోడ్డుపై ఉన్న కంకర దిబ్బ కారణంగా ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదానికి గురయ్యాడు. కంకరపై వాహనం అదుపుతప్పి కిందపడటంతో అతడికి గాయాలయ్యాయి. అయితే ప్రమాదవశాత్తూ చిన్నచిన్న గాయాలతో బయటపడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఏదైనా పెద్ద వాహనం అదుపుతప్పినా, ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించుకునే క్రమంలో ప్రమాదం జరిగినా తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




రోడ్డు నిర్మాణ పనులకు కంకర అవసరమైనప్పటికీ, ప్రధాన రహదారిపై సగం మేర దిబ్బగా పోసి ఉంచడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పగటిపూట పరిస్థితి కొంతవరకు కనిపించినప్పటికీ రాత్రి వేళల్లో కంకర దిబ్బ సరిగా కనిపించకపోవడంతో ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై సగం మేర ఉన్న కంకర దిబ్బను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు పూర్తిస్థాయిలో మార్గం కల్పించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కాకుండా.. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంకర దిబ్బను తొలగించి మరో ప్రమాదం జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

# భద్రాచలంలో 6.130 కిలోల గంజాయి పట్టివేత...



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఆగస్టు 23:** భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 6.130 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే మార్గంలో ఇసుక రీచ్ వద్ద శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం (ఓడి 10 వి 5439)ను ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించింది.

ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కన్‌గిరి జిల్లా నుయాగూడకు చెందిన సుభాన్ ధనాపుల్, నబరంగ్‌పూర్ జిల్లా పండికోట్‌కు చెందిన ఉదయ హరిజన్ మల్కన్‌గిరి నుంచి భద్రాచలానికి గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 6.130 కిలోల ఎండు గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.4.51 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సీహెచ్. శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనం, సెల్‌ఫోన్లను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు రమేశ్‌బాబు, వెంకన్న, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు.

గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే 18004252523 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# అంగన్వాడీ పోస్టుల ఎంపిక పారదర్శకంగా దళారులను నమ్మి మోసపోవద్దు:

- జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా.




**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 23,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టుల భర్తీకి చేపట్టిన ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు.

పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పే వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత అర్హతలు, రిజర్వేషన్ నిబంధనలు, మెరిట్ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు.

ఎవరికి ఉద్యోగం వస్తుందో ముందుగా ఎవరికీ తెలియదని, ఎంపిక పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా అధికారిక ప్రక్రియపై మాత్రమే ఆధారపడాలని సూచించారు.

వచ్చే వారంలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ముఖాముఖి (ఇంటర్వ్యూ) నిర్వహించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు.

## నల్ల పోచమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా చేగుంటలో

- వర్షంలో ఉత్సాహంగా బోనాల ఊరేగింపు,
- పాల్గొన్న సర్పంచ్ కుటుంబం,



**ఆగస్టు 23 (సీ కే న్యూస్) చేగుంట:**చేగుంట పట్టణ కేంద్రంలోని గల శ్రీ మాల నల్ల పోచమ్మ మహోత్సవ బోనాల పండుగ ఘనంగా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు,ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ కుటుంబ ముఖ్య అతిథిగా పాల్గొని కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు వివిధ గ్రామాల ప్రజలు సంతోషంగా సుభిక్షంగా ఆయు ఆరోగ్యాలతో సిరిసంపదలతో ఉండాలని, అమ్మవారిని దర్శించారు, ఆలయ కమిటీ సభ్యులు, చేగుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు సంద్రగు సతీష్ ను శాలువతో సత్కరించారు, ఈ కార్యక్రమంలో తలారి లింగం, మాల సంక్షేమ సంఘం సభ్యులు కర్నే రాములు, సిరిగోజి రమేష్, కర్నే నర్సింలు, సిరిగోజి రవి, సిరిగోజి సత్యనారాయణ, స్టాలిన్ నర్సింలు, కొండ ప్రసాద్, కర్నే బాబు, కొండి స్వామి, సిరిగోజి చిన్న నర్సింలు, సిరిగోజి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు రోజులపాటు ఎన్‌సీఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన...



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 23,**జాతీయ ఎన్‌సీఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ఈ నెల 24, 25 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

24వ తేదీ ఉదయం 10.30 గంటలకు కొత్తగూడెంలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌కు చేరుకోనున్న కమిషన్ సభ్యుడు, 11.30 గంటల వరకు లక్ష్మీదేవిపల్లి మండలం కూనారం గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అశ్వాపురం మండలంలోని హెవీ వాటర్ బోర్డు కాన్ఫరెన్స్ హాల్‌లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సీనియర్ అధికారులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. 25వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో సమావేశమై గిరిజనులకు సంబంధించిన పెండింగ్ కేసులపై సమీక్షించనున్నారు.

ఎన్‌సీఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన సందర్భంగా విధులు కేటాయించిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు ప్రత్యేక బాధ్యతలు తీసుకుని ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సూచించారు.?

## నాచారం దేవాలయ ఈవోగా రామారావు

**భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యం: ఈవో రామారావు**



**సీకే న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 24 2026:** ఏన్కూరు మండలం నాచారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉడతనేని రామారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన రామారావుకు గ్రేడ్--2 ఈవోగా పదోన్నతి లభించింది.

పదోన్నతిపై నాచారం దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు దేవస్థానం సిబ్బంది అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రామారావు మాట్లాడుతూ దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడతానన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

దేవస్థానంలో భక్తుల సౌకర్యాలు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి, ఆలయానికి మరింత భక్తుల ఆదరణ పెరిగేలా చర్యలు తీసుకుంటానని రామారావు పేర్కొన్నారు.

# చేగుంటలో ముగిసిన జిల్లాస్థాయి యోగా పోటీలు-విజేతలు వీరే



**ఆగస్టు 23 సీ కే న్యూస్ చేగుంట :** చేగుంట లోని ప్రభుత్వ పాలిటెక్నీ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలకు జిల్లా నలుమూలల నుండి 200 పైబడి క్రీడాకారులు, క్రీడాకారిణిలు,మహిళలు,పురుషులు పాల్గొన్నారని మెదక్ జిల్లా అధ్యక్షులు కరణం గణేష్ రవికుమార్ తెలిపారు.అండర్ 14 బాలికల ట్రెడిషనల్ విభాగంలో 1,అవ్యక్త 2,వర్ణశ్రీ 3,రచన ఎంపికయ్యారు. అండర్ 14 బాలుర విభాగంలో 1,లోకేష్,2,శివప్రసాద్,3,శ్రీకర్ ఎంపికయ్యారు. జూనియర్ బాలికల విభాగంలో 1,అవంతిక 2,సాత్విక,3,రోజా స్టాండ్ బైగా పూజ,సంకి ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో 1,మనితేజ,2,నవదీప్ ,3,అరుణ్ గౌడ్ స్టాండ్ బైగా శివ కుమార్,సాయిదీక్షిత ఎంపికయ్యారు. సీనియర్ బాలికల విభాగంలో1,మాధురి,2,శ్రీవాణి, 3,రసజ్ఞ స్టాండ్ బైగా మమత ఎంపికయ్యారు. సీనియర్ బాలుర విభాగంలో 1,రాకేష్, 2, శ్రీశాంత్,3, నిశాంత్ ఎంపికయ్యారు. సీనియర్ ఏ విభాగంలో 1, సుభాష్,2, సుదర్శన్,3,రాహుల్ స్టాండ్ బై గా బాలరాజు,నవీన్ ఎంపికయ్యారు.సీనియర్ బి విభాగం లో 1,నవీన్,2,నాంపల్లి3, పెంట గౌడ్ స్టాండ్ బై గా రమేష్,ప్రవీణ్ ఎంపికయ్యారు.సీనియర్ సి విభాగం లో 1,మనోహర్2,చంద్రశేఖర్3,సంతోష్ స్టాండ్ బై గా భూపాల్ రెడ్డి,నాగరాజు

అండర్ 14 ఆర్టిస్టిక్ గర్ల్స్

లిఆర్టిస్టిక్ సింగల్ 1,శ్రావణరేఖ 2,రచన , 3విజయలక్ష్మి

ఆర్టిస్టిక్ పెయిర్ 1,స్నేహుజ,పల్లవి 2,విలాసిని, ఆరాధ్య 3,సంగీత,నిహారిక రిథమిక్ పెయిర్ 1,దీక్ష,హర్షిత 2,సాయిపూజ,అవంతి 3,అనికిత,సింధూజ

జూనియర్ గర్ల్స్లిఅండర్ 18 ఆర్టిస్టిక్ సింగల్ 1,రేఖ 2,సాఫియా 3,రమాదేవి ఆర్టిస్టిక్ పెయిర్ 1,సంకి రమాదేవి రిథమిక్ పెయిర్ వైష్ణవి శైలజ

సీనియర్ మహిళలు ఆర్టిస్టిక్ సింగల్ 1,సుస్మిత 2,వైశాలిఆర్టిస్టిక్ పెయిర్ 1, ఏ,నందిని యం.నందిని 2,సుస్మిత వైశాలి రిథమిక్ పెయిర్ 1,శిరీష మనోజ 2,శ్రీవాణి రసజ్ఞ బాలుర సబ్ జూనియర్ విభాగం

ఆర్టిస్టిక్ సింగల్

1,మణికంఠ 2,రమేష్ 3,శంకర్

ఆర్టిస్టిక్ పెయిర్

1,కార్తీక్,గౌతం 2,వినోద్,జయకృష్ణ 3,శివానందు,పవన్

రిథమిక్ పెయిర్

1,నితీష్ రెడ్డి,యశ్వంత్ అండర్ 18 ఆర్టిస్టిక్ సింగల్ 1,అరుణ్ గౌడ్ 2,నవదీప్ సాగర్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన చేగుంట గ్రామ సర్పంచ్ స్రవంతి సతీష్ ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ తోట సతీష్ జడ్జిలు ముద్దుల సత్యం శ్రీదేవి మాలతి మల్లీశ్వరి శ్రీలత నర్సింలు మనిషా రేఖ అంజయ్య దీపక్ ప్రసన్న తదితరులు న్యాయనీయతలుగా వ్యవహరించారు

# అర్ధరాత్రి పాము కాటు.. మహిళ మృతి



- జనగాం గ్రామ శివారులో విషాద ఘటన
- తాండూరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పరిస్థితి విషమం
- వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు నిర్ధారణ

**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, ఆగస్టు 23:**పెద్దేముల్ మండలం జనగాం గ్రామ శివారులో పాముకాటుతో ఓ మహిళ మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది.జనగాం గ్రామ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో కాపలాదారులుగా, కూలీలుగా పనిచేస్తున్న దంపతుల కుటుంబంలో ఈ విషాదం చోటుచేసుకుంది.మృతురాలిని నర్సమ్మగా గుర్తించారు.ఆమె భర్త ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**అర్ధరాత్రి పాము కాటు**

పోలీసుల వివరాల ప్రకారం.. ఆంజనేయులు తన భార్య నర్సమ్మ, పిల్లలతో కలిసి సుమారు నాలుగేళ్ల క్రితం జీవనోపాధి కోసం జనగాం గ్రామానికి వచ్చారు.అప్పటి నుంచి గ్రామ శివారులో హైదరాబాద్‌కు చెందిన మైనోద్దీన్ కు చెందిన ఫామ్‌హౌస్‌లో కాపలాదారులుగా, లేబర్లుగా పనిచేస్తూ అక్కడే ఉన్న లేబర్ రూమ్‌లో నివాసం ఉంటున్నారు.ఈ క్రమంలో ఆగస్టు 23న రాత్రి కుటుంబ సభ్యులు లేబర్ రూమ్‌లో నిద్రిస్తుండగా, అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో నర్సమ్మను గుర్తుతెలియని పాము కాటువేసినట్లు పోలీసులు తెలిపారు. పాము కాటుతో తీవ్ర నొప్పికి గురైన ఆమె కేకలు వేస్తూ ఏడవడంతో భర్త ఆంజనేయులు అప్రమత్తమయ్యారు.

**తాండూరు ఆసుపత్రికి తరలింపు**

వెంటనే ఆంజనేయులు, పక్క పొలంలో నివసించే బ్యాగరి అనంతప్ప సహాయంతో నర్సమ్మను ఆటోలో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పాముకాటుకు చికిత్స అందించి స్నేక్ బైట్ ఇంజక్షన్ ఇచ్చారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు.

**హైదరాబాద్‌కు తరలిస్తుండగా**

అంబులెన్స్‌లో నర్సమ్మను హైదరాబాద్‌కు తరలిస్తుండగా వికారాబాద్ సమీపంలో ఆమెకు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీంతో ఆంజనేయులు ఆమెను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

**అనుమానం లేదన్న భర్త ఆంజనేయులు**

తన భార్య నర్సమ్మ పాముకాటుతోనే మృతి చెందినట్లు ఆంజనేయులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె మృతిపై ఎవరి పైనా తనకు ఎలాంటి అనుమానం లేదని తెలిపారు.

**కేసు నమోదు.. దర్యాప్తు**

ఈ ఘటనపై ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దేముల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించడంతో పాటు ఘటనపై చట్టప్రకారం తదుపరి దర్యాప్తు చేపట్టారు. నర్సమ్మ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.

# గంజాయి విక్రయానికి వచ్చి పోలీసులకు చిక్కిన వ్యక్తి



- పెద్దేముల్‌లో 1.020 కిలోల గంజాయి పట్టివేత
- నిందితుడి నుంచి రూ.34 వేల విలువైన గంజాయి పట్టివేత
- చీణ్రూా చట్టం కింద కేసు.. న్యాయ రిమాండ్‌కు తరలింపు

**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, ఆగస్టు 23:**గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఓ వ్యక్తిని పెద్దేముల్ పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 1,020 గ్రాముల ఎండిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.34 వేలు రూపాయలుగా పోలీసులు అంచనా వేశారు. నిందితుడిపై చీణ్రూా చట్టం కింద కేసు నమోదు చేసి న్యాయ రిమాండ్‌కు తరలించినట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

**విశ్వసనీయ సమాచారంతో నిఘా**

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 22న పెద్దేముల్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని శ్రీ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద గంజాయి విక్రయించేందుకు ఓ వ్యక్తి రానున్నట్లు సమాచారం అందింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పోలీసులు పంచ సాక్షుల సమక్షంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

**బ్యాగులో గంజాయి గుర్తింపు**

మధ్యాహ్నం సుమారు 1:30 గంటల సమయంలో ఓ వ్యక్తి బ్యాగ్‌తో అనుమానాస్పదంగా అక్కడికి చేరుకోవడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సమీపంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల క్రీడా మైదానానికి తీసుకెళ్లి పంచ సాక్షుల సమక్షంలో విచారణ, తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అతని బ్యాగులో తెల్లటి ప్లాస్టిక్ కవర్‌లో దాచిన 1,020 గ్రాముల ఎండిన గంజాయిని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తింపు**

నిందితుడిని బీహార్ రాష్ట్రానికి చెందిన మొహమ్మద్ ముస్తకీమ్ (44)గా పోలీసులు గుర్తించారు. గంజాయిని అక్రమంగా విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.34,000గా అంచనా వేశారు.

**న్యాయ రిమాండ్‌కు తరలింపు**

నిందితుడిపై చీణ్రూా యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అనంతరం ఆదివారం ఉదయం నిందితుడిని న్యాయ రిమాండ్‌కు తరలించినట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

**మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు**

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని పెద్దేముల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## రియల్ ఎస్టేట్ ఏజెంట్‌పై కేసు, అరెస్ట్

- ప్లాట్ విక్రయిస్తానని నమ్మించి రూ.3.70 లక్షలు వసూలు.. మరో రూ.2 లక్షలు డిమాండ్
- రిజిస్ట్రేషన్ చేయకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన
- మావల ఎస్ హెచ్ ఓ బి.డి. ప్రేమ్ కుమార్




**సి కె న్యూస్ ప్రతినిధి.ఆదిలాబాద్ జిల్లా,**నిందితుడి పేరు:

దరాడే కేశవ్ (43) ం/శీ దరాడే లక్ష్మణ్, తీ/శీ హెచ్.నెం. 6-186, రామ్‌నగర్, ఆదిలాబాద్ పట్టణం.

మావల పోలీస్ స్టేషన్ పరిధిలో ప్లాట్ విక్రయిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేసి, రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ పై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి నట్లు మావల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు.

ఫిర్యాదుదారు జాధవ్ నౌసీలాల్ తన తండ్రి 2018లో పొందిన రిటైర్‌మెంట్ ప్రయోజనాలతో ఆదిలాబాద్ పట్టణంలో ప్లాట్ కొనుగోలు చేయాలని భావించారు. ఈ క్రమంలో గ్రామానికి పరిచయస్తుడైన రియల్ ఎస్టేట్ ఏజెంట్ దరాడే కేశవ్ ను సంప్రదించగా, ాౖ== టౌన్‌షిప్‌లోని సర్వే నంబర్ 90లో ప్లాట్ నంబర్ 27 తనదేనని, దానిని విక్రయిస్తానని నమ్మించాడు.

ప్లాట్ ధర రూ.7.70 లక్షలుగా నిర్ణయించగా, 30-01-2020న రూ.3 లక్షలను చెక్కు ద్వారా, 26-04-2020న మరో రూ.70 వేల నగదును ఫిర్యాదుదారు చెల్లించారు. అనంతరం రిజిస్ట్రేషన్ కోసం పలుమార్లు కోరినప్పటికీ కేశవ్ వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేశాడు.

2023 జనవరిలో మరోసారి రిజిస్ట్రేషన్ విషయమై సంప్రదించగా, ప్లాట్ ధర పెరిగిందని, అదనంగా రూ.2 లక్షలు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పడంతో 23-01-2023న ఆ మొత్తాన్ని కూడా చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో పాటు డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని తెలిపారు.

అదే ప్లాట్‌ను ఇతరులకు కూడా చూపిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు, అలాగే ప్లాట్‌కు సంబంధించి ాౖ=ూ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్న విషయాన్ని తమకు వెల్లడించకుండా తప్పుడు హామీలతో డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

ఫిర్యాదు మేరకు దరాడే కేశవ్‌పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టినట్లు మావల ఇన్‌స్పెక్టర్ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో సంబంధిత పత్రాలు, యాజమాన్య హక్కులు, రిజిస్ట్రేషన్ వివరాలు, ాౖ=ూ తదితర అంశాలను పూర్తిగా పరిశీలించిన అనంతరం మాత్రమే లావాదేవీలు చేయాలని సూచించారు.

# మడిపల్లి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

- సర్పంచ్ రామలింగం, కాయిత నరేష్ అదుపులోకి
- నిందితుల సంఖ్య 17కు చేరిక




సి కే న్యూస్, తొర్రూరు : మడిపల్లి గ్రామంలో గుంటక రమేష్ హత్య కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇప్పటికే 15 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. తాజాగా మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మడిపల్లి గ్రామ సర్పంచ్ రామలింగం, కాయిత నరేష్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు తొర్రూరు పోలీసులు తెలిపారు. ఈ నెల 19న మడిపల్లి గ్రామంలో గుంటక రమేష్ దారుణ హత్యకు గురయ్యారు. అయితే ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేపట్టారు. విచారణలో వెల్లడైన అంశాలు, నిందితుల పాత్రకు సంబంధించి సేకరించిన ఆధారాల ఆధారంగా ఇప్పటికే 15 మందిని అరెస్టు చేశారు.

**లోతుగా విచారణ**

తాజాగా రామలింగం, కాయిత నరేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. హత్యకు దారితీసిన పరిస్థితులు, ఘటనకు ముందు జరిగిన పరిణామాలు, నిందితుల పాత్రపై లోతుగా విచారణ చేస్తున్నారు. కేసుతో సంబంధం ఉన్న మరికొందరిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం. తాజా అరెస్టులతో కేసులో నిందితుల సంఖ్య 17కు చేరింది. దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తొర్రూరు ఎస్సై మహేందర్‌రెడ్డి తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

# లక్ష్యంపై పట్టు సాధిస్తే కొలువు ఖాయం: అభ్యర్థులకు కలెక్టర్ రాజర్షి షా దిశానిర్దేశం

సి కె న్యూస్ ప్రతినిధి.ఆదిలాబాదు:నిర్దిష్టమైన ప్రణాళిక, పట్టుదలతో చదివితే పోటీ




పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత కొలువులు సాధించడం సులువవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5 నెలల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణలో భాగంగా ఆదివారం స్థానిక రాంనగర్ కాలనీలోని ఎస్సీ స్టడీ సర్కిల్ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన సివిల్స్ ప్రిపరేషన్ అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటూ పోటీ పరీక్షల తయారీపై దిశానిర్దేశం చేశారు. పరీక్ష ఏదైనా ముందుగా సిలబస్‌పై సంపూర్ణ స్పష్టత ఉండాలని, పరిమిత ప్రామాణిక పుస్తకాలను మాత్రమే ఎంచుకోవాలని సూచించారు. వార్తాపత్రికలు, మేగజైన్ల నుంచి ముఖ్యమైన అంశాలను స్వయంగా నోట్స్ రాసుకుంటే చివరి సమయంలో రివిజన్ సులభమవుతుందని తెలిపారు. తక్కువ మంది మిత్రులతో గ్రూప్ స్టడీ చేయడం ద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, సందేహాలు నివృత్తి అవుతాయని చెప్పారు. మాక్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు రాస్తూ తప్పులను విశ్లేషించుకోవాలని, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల్లో సరైన జవాబును గుర్తించేందుకు ఎలిమినేషన్ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. త్వరలోనే పలు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు రానున్నందున అభ్యర్థులు ఫోన్ వంటి ఆకర్షణలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదవాలని పిలుపునిచ్చారు. స్టడీ సర్కిల్ భవన శాశ్వత నిర్మాణంతో పాటు డిజిటల్ బోధనకు ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. కె.రమేష్, అధ్యాపకులు, ఉద్యోగార్థులు, తదితరులు పాల్గొన్నారు.ద

# కొత్తగూడెంలో నేత్రపర్వంగా పోచమ్మ తల్లి బోనాల జాతర...



సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 23,శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవస్థానం ఆధ్వర్యంలో బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు.

ఆలయ ధర్మకర్త పల్లా రాజనర్సు ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. జాతరలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చి పట్టణంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. అమ్మవారి వివిధ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మహిళలు భక్తిశ్రద్ధలతో శిరస్సుపై బోనాలు ధరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్పూర హారతులతో మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు ఎరువుల విక్రయం.. శ్రీనివాస ఫర్టిలైజర్స్ లైసెన్స్ సస్పెన్షన్



సి కె న్యూస్ ప్రతినిధి ఆదిలాబాద్:రైతుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పీ) కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించిన ఉట్నూరులోని వీ/o శ్రీనివాస ఫర్టిలైజర్స్ పై వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీలు, విచారణలో 28-28-0 ఎరువును నిర్ణయించిన ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు విక్రయించినట్లు నిర్ధారణ కావడంతో దుకాణం ఎరువుల విక్రయ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు.

ఫర్టిలైజర్ (కంట్రోల్) ఆర్డర్ , 1985 నిబంధనలను ఉల్లంఘించినందుకు శ్రీనివాస ఫర్టిలైజర్స్ ఎరువుల విక్రయ లైసెన్స్‌ను 21.08.2026 నుంచి 03.09.2026 వరకు 15 రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలోని ఎరువుల డీలర్లు ఫర్టిలైజర్ (కంట్రోల్ ) ఆర్డర్ , 1985 నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీకే ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయించడం, అక్రమంగా ఎరువులను నిల్వ చేయడం, స్టాక్ రికార్డుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడటం వంటి ఉల్లంఘనలను సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులు ఎరువులను లైసెన్స్ పొందిన అధీకృత దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు సంబంధించి దుకాణదారుడి నుంచి తప్పనిసరిగా బిల్లు లేదా రసీదు తీసుకోవాలని తెలిపారు. ఎరువుల దుకాణాల్లో స్టాక్ వివరాలు, ధరల పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని డీలర్లను ఆదేశించారు.

ఫీఫీా ఎరువుల బుకింగ్ యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే సమయంలో రైతులకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఊజూూ) లేదా మండల వ్యవసాయ అధికారి (పీూూ)ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఎరువుల కొనుగోలు సమయంలో అధిక ధరలు వసూలు చేసినా, ఎరువుల లభ్యత, విక్రయాలు లేదా ఇతర సమస్యలు ఎదురైనా రైతులు 8977742855 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

జిల్లాలో ఎరువుల విక్రయాలపై వ్యవసాయ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలిగించేలా అధిక ధరలకు ఎరువులు విక్రయించినా, అక్రమ నిల్వలకు పాల్పడినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా లైసెన్స్ సస్పెన్షన్‌తో పాటు అవసరమైతే మరింత కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# పిడిఎస్ బియ్యం అక్రమ తరలింపు.. నిందితుడు అరెస్ట్



సీకే న్యూస్ ప్రతినిధి.ఆదిలాబాద్ జిల్లా,

300 కిలోల పిడిఎస్ బియ్యం, మహీంద్రా మ్యాక్స్ వాహనం స్వాధీనం

నిందితుడిని అరెస్ట్ చేసి, జైలు కు రిమాండ్ తరలింపు

ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా

తలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలో పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 300 కిలోల పిడిఎస్ బియ్యంతో పాటు మహీంద్రా మ్యాక్స్ ఫెస్టారా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు.

ఆగస్టు 22న పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో తలమడుగు ఎస్‌హెచ్‌ఓ డి. రాధిక పోలీస్ సిబ్బందితో కలిసి సుంకిడి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వస్తున్న టా-01-జుఖీ-6902 నంబర్ గల మహీంద్రా మ్యాక్స్ ఫెస్టారా వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, 8 ప్లాస్టిక్ సంచుల్లో 300 కిలోల పిడిఎస్ బియ్యం గుర్తించారు.

నిందితుడు: ఇమ్రాన్ ఖాన్ (32), ం/శీ పాషా ఖాన్, వృత్తి: డ్రైవర్, పతోడా గ్రామం, మండ్వి పోస్టు, కిన్వట్ తాలూకా, నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర.

నిందితుడు ఆదిలాబాద్‌లో తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి మహారాష్ట్రలో అధిక ధరకు విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఈ ఘటనపై క్రైం నంబర్ 181/2026, దీచీూ 318(4), 316(5) మరియు ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ సెక్షన్ 7 కింద కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్ చేసి జైలుకు తరలించినట్లు సీఐ రహీం పాషా తెలిపారు.

పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఆడే గజేందర్ గారి జన్మదిన వేడుకల లో భారీగా తరలి వచ్చిన కార్యకర్తలు నేరడిగొండ

సీకే న్యూస్ ప్రతినిధి ఆదిలాబాద్

నాయకులు, కార్యకర్తలతో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్న ఆడే గజేందర్

మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి మరియు జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసిన ఆడే గజేందర్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ గారి జన్మదిన వేడుకలు నేరడిగొండ మండల కేంద్రంలోని సూర్య గార్డెన్స్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలకు బోథ్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో నేరడిగొండలో సందడి నెలకొంది

ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు గజేందర్ గారికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు బోథ్ నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా హాజరై తమ అభిమానాన్ని చాటుకోవడంతో సూర్య గార్డెన్స్ ప్రాంగణం కాంగ్రెస్ జెండాలు, నినాదాలతో సందడిగా మారింది. గజేందర్ అన్న నాయకత్వానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించారు

ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆడే గజేందర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, రాజకీయంగా మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.జన్మదిన వేడుకలకు భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో ఆడే గజేందర్ జన్మదిన వేడుకల సందర్భంగా నేరడిగొండ దద్దరిల్లింది

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, ఆదిలాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య,మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి,మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి,బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్,ఇచ్చోడ బ్లాక్ ఆత్మ చైర్మన్ కొడల నారాయణ,ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్వర్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి,తిత్రే నారాయణ్ సింగ్,బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఏలేటి మోహన్ రెడ్డి,మండల అధ్యక్షులు కళ్ళెం నారాయణ రెడ్డి,మెరుగు భోజన్న,గాజుల పోతన్న,కళ్ళెం విఠల్,కంచం లక్ష్మణ్,దౌలత్ రావు,కొడల సంతోష్, కాసుల ప్రతాప్,దండే సుదర్శన్,సర్పంచ్లు,మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీ,మాజీ జడ్పీటీసీ,పాక్స్ చైర్మన్లు,మార్కెట్ డైరెక్టర్లు,ఆత్మ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు



# శ్రీ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నిక,

- ఆలయ కమిటీ చైర్మన్ గా, సంద్రుగు సతీష్,
- వైస్ చైర్మన్ సంపంత్




ఆగస్టు 23 (సీ కే న్యూస్) చేగుంట

చేగుంట పట్టణ కేంద్రంలోనీ శ్రీ మహంకాళి ఆలయ కమిటీ నూతన చైర్మన్ గా నియమితులైన సంద్రు సతీష్, ఆలయ కమిటీ సభ్యులకు పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు,ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఆలయ కమిటీ చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన నేను భక్తి, సేవ, నిజాయితీకి మారుపేరుగా ఉంటానన్ని తెలిపారు,

చిన్న వయసు నుంచే అమ్మవారి సేవలో ఉంటూ, ప్రతి బోనాల జాతరలో ముందుండి నడిపించే వ్యక్తిగా సొంత లాభం చూడకుండా ఆలయ అభివృద్ధి కోసం, భక్తుల సౌకర్యాల కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.

స్థానికులతో సత్సంబంధాలు, పెద్దల పట్ల గౌరవం, యువతకు మార్గదర్శనం, వీరి ప్రత్యేకత. ఆలయ ఆదాయ, ఖర్చులలో పారదర్శకత పాటిస్తూ, అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని భక్తులందరి నమ్మకాలను వమ్ము చేయకుండా ఉంటానని,

ఆలయానికి సేవకుడు ఎంత ముఖ్యమో,నాపైన నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత నాకు అప్పగించినందుకు పేరుపేరున ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తూ భరోసాగా ఉంటా అన్నారు,

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలో రోడ్డు ప్రమాదం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన జానీపాషా(45) లారీ డ్రైవర్ గా గుర్తించారు.

ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# శ్రీ.శ్రీ.శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ,బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు

**మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్.కేశవ్**

**సి.కె న్యూస్ ప్రతినిధి గద్వాల్**

ఈరోజు గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు నల్లకుంట కాలనీ లో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయం నందు శ్రీ గణపతి, కుమారస్వామి,నందీశ్వర,వృషభ ధ్వజ,ఆలయ శిఖర ఆదిత్యాది నవగ్రహ సహిత పార్వతి పరమేశ్వర విగ్రహాల ప్రతిష్ట మరియు ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవానికి హాజరై,ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు స్వీకరించి,స్వామి వారి ఆశీస్సులను పొందారు....

అనంతరం,అర్చకులు & ఆలయ కమిటీ సభ్యులు బాసు శ్యామల హనుమంతు నాయుడు & బీఎస్.కేశవ్ గార్లని శాలువాతో ఘనంగా సత్కరించి, ఆశీర్వదించారు....బిలి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....

గద్వాల పట్టణంలోని 21వ వార్డులో నూతన దేవాలయంలో విగ్రహాల ప్రతిష్టా మరియు ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించుకోవడం చాలా సంతోషకరంగా ఉందని వారు అన్నారు....

భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆశీస్సులతో పట్టణ మరియు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు....బిలి



ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్,చీ= జగదీష్, చంటన్న,గువ్వల గోపాల్, నరసింహులు,మోహన్ యాదవ్, చిత్తరి కిరణ్,రామకృష్ణ,రాముడు,పూడూరు రఘు నాయుడు,బి.లక్ష్మారెడ్డి, సుభాష్ రంగారెడ్డి,ప్రహ్లాద్,నాగేష్, జగదీష్,నరసింహులు, గోవిందు, వీరేష్, తిమ్మప్ప, రాముడు, మల్లికార్జున్, మహేందర్, నరేష్,మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు....

# విద్యార్థి మృతి పట్ల సమగ్ర విచరణ చేపట్టాలి..



**ఆగస్టు (23) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.**

విద్యార్థి మృతి పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్ ని సస్పెండ్ చేయాలి..

-కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు

నారాయణఖేడ్ జూకల్ శివారులో కొనసాగుతున్న శంకరంపేట్ మాహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థి చనిపోవడం పట్ల ప్రిన్సిపల్ నిర్లక్ష్యం ఉందని, విద్యార్థి మరణానికి సమగ్ర విచారణ జరిపించి హాస్టల్ ప్రిన్సిపాల్ ని సస్పెండ్ చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొతారి నర్సింలు డిమాండ్ చేశారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అనేకసార్లు హాస్టల్లో ఇలాంటి ఘటనలు జరిగిన ప్రభుత్వం అధికారులు చర్యలు సక్రమంగా తీసుకుపోవడం వలన ఇలాంటి ఘటనలు కొనసాగుతున్నాయని అన్నారు.. విద్యార్థులకు పెట్టవలసిన భోజనాలు సదుపాయాలు సరిగా కల్పించకపోవడం వలన ఇలాంటి ఘటనలు కొనసాగుతుందన్నారు. హాస్టలను పరిరక్షణలో ప్రభుత్వ అధికారులు పూర్తిగా విఫలం చెందారని వెంటనే విచారణ చేపట్టాలని విద్యార్థులకు ఇప్పటికైనా సరైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థికి మృతికి కెవిపియస్ సంఘం సంతాపం ప్రకటిస్తూ వెంటనే ఈ మృతికి కారణమైన హాస్టల్ సిబ్బంది పైన చర్యలు తీసుకోవాలని మరియు విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం అధికారులు హాస్టలను సందర్శించక పోవడం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. సబ్ కలెక్టర్ ఇక్కడ ఉన్న ఒకే హాస్టల్ ను సందర్శించడం కాకుండా అన్ని హాస్టల్లో సందర్శించి ఉంటే ఇలాంటి ఘటనలు జరగకపోయేమో నాని అన్నారు. వాస్తవానికి విద్యార్థి సంఘాల నాయకులకు ఇతర సంఘాల నాయకులకు హాస్టల్లో వెళ్ళనీయకపోవడం వల్లనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అధికారులు హాస్టల్లో ఏం జరుగుతుందో తెలియకుండా విద్యార్థుల మృతి కారణమయ్యారని అన్నారు. వెంటనే ప్రిన్సిపల్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపియస్ నాయకులు గణపతి, రాహుల్, లాలప్ప తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఘనంగా శాలువాతో సన్మానం చేసిన మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రేసు బుచ్చిరెడ్డి.

**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 23.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ఈరోజు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.

పలు కార్యక్రమాలకు హాజరైన సందర్భంగా వలిగొండ మండలం సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు రేసు బుచ్చిరెడ్డి ఎమ్మెల్యేను శాలువతో ఘనంగా సన్మానం చేసినారు .

ఎమ్మెల్యే కుంభశీ అనిల్ కుమార్ రెడ్డి వలిగొండ మండలానికి చేసిన అభివృద్ధి పనులను మీడియా ద్వారా వివరించినారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు జిల్లా నాయకులు బత్తిని సహదేవు గరిసే రవి బద్దం సంజీవరెడ్డి జక్క జంగారెడ్డి భీమా నాయక్ జానకి రాములు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు బాసటగా మన ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది

**ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య.**

**సి కే న్యూస్ ఆగస్టు 23**

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఆదివారం ఉదయం చర్లపాలెం గ్రామంలో కీ,శే,లు మేకపోతుల సత్తెమ్మ అకాల మరణం చెందగా వారి మొదటి సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ప్రభుత్వం అంటేనే ప్రజల పక్షాన ఉంటూ బడుగు బలహీనుల బలోపేతానికి వారి వ్యక్తిగత వికాసానికి తోడ్పాటును,చేయూతనందిస్తుందని, బాధిత కుటుంబాన్ని ఓదార్చి వారు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

అనంతరం చైర్మన్ రాజయ్య మీడియాతో మాట్లాడుతూ నేటి యువత-రేపటి భవిత అని ప్రజల కోసం ఏర్పడిన ప్రజాస్వామ్య దేశంలో యువత రాజకీయాల్లోకి రావాలని,దేశ భవిత యువత రాజకీయాలపై ఆధారపడి ఉందని,పేద ధనిక లింగ బేధ ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ సమాన ఓటు హక్కు కల్పించారని, ఐదు సంవత్సరాలకోసారి, ఎన్నికల నిర్వహణ,రిజర్వేషన్ ప్రక్రియ, నచ్చినవారికి ఓటు వేసే స్వేచ్చా హక్కులు కల్పించబడిందని, ప్రజాస్వామ్య పునాదులు మన గ్రామ పంచాయితీలని, ఆర్థిక స్వలంబన బలోపేతానికి రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేయనైనదని, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపారమైన నమ్మకంతో, స్థానిక స్వయం పరిపాలన సంస్థల్లో అనుభవం ఉన్న నాకు బాధ్యతలు అప్పగించారని, చిత్తశుద్ధితో ప్రతి మారుమూల గ్రామ పంచాయితీల అభివృద్ధి ధ్యేయంగా వ్యవస్థకు, ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య అన్నారు.



ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివాహా మహోత్సవాలకు హాజరైన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాస్ హనుమంతు నాయుడు



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల్**ఈరోజు గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలో మరియు గద్వాల పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహా వేడుకలకు బిబాసు హనుమంతు నాయుడు గారు హాజరై,నూతన వధూవరులను అక్షింతలు వేసి,ఆశీర్వదించి,హార్దిక శుభాకాంక్షలు తెలిపారు....

వీరి వెంట,వెంకటేష్ నాయుడు, లక్ష్మీకాంత్ రెడ్డి,రాముడు,జాంపల్లి భరత్ సింహారెడ్డి, నరసింహులు, బి.లక్ష్మారెడ్డి,శేఖర్ గౌడ్,సుభాష్ రంగారెడ్డి,ఆంజనేయులు, రవి,రాము, పరశురాముడు, రంగస్వామి,వీరేష్, ప్రహ్లాద్,చాకలి శ్రీనివాసులు, తిమ్మప్ప, సురేష్ ఈరన్న,మరియు గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు....

# నూతన గృహప్రవేశాలకు హాజరైన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు



**సీకే న్యూస్ ప్రతినిధి గద్వాల్:**ఈరోజు గద్వాల నియోజకవర్గం కేటీ దొడ్డి మండలం కొండాపురం గ్రామంలో గొన్నెల రవి నూతన గృహప్రవేశానికి హాజరై,వారు ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని,వారికి శుభాకాంక్షలు తెలిపారు....

అనంతరం,లిబిబాసు హనుమంతు నాయుడు

ఇంటి యజమాని శాలువతో ఘనంగా సత్కరించారు..

అదే విధంగా, బిఅలంపూర్ చౌరస్తా లోని టీచర్ ఆర్.గజరాజు

నూతన గృహప్రవేశానికి బాసు శ్యామల హనుమంతు నాయుడు

హాజరై, వారికి శుభాకాంక్షలు తెలిపారులి....

ఈ కార్యక్రమంలో వెంకటేష్ నాయుడు,జాంపల్లి భరత్ సింహారెడ్డి, ఉప సర్పంచు బాసు గోపాల్, రాముడు,నక్క రవి,బి.లక్ష్మారెడ్డి,కావాలి గోపి,గాజుల కృష్ణారెడ్డి,సుభాష్ రంగారెడ్డి,గోవిందు,శేఖర్ గౌడ్, కురవ శివప్ప,గోనెల స్వామి,కురవ ఓబులేష్,ప్రహ్లాద్,రవి నాయక్,తిమ్మప్ప,మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు....

# మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జిబాసు హనుమంతు నాయుడు




**సీకే న్యూస్ ప్రతినిధి గద్వాల్ :**ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ నందు కె.టీ.దొడ్డి మండలం మల్లాపురం గ్రామానికి చెందిన కురువ శ్రీరామ్ ఉరి వేసుకుని మృతి చెందాడు... విషయం తెలుసుకొని ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు .....

వీరి వెంట,పార్టీ నాయకులు, కార్యకర్తలు,మరియు గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు....

# అంతరాలయ అభిషేక సేవ తాత్కాలికంగా నిలిపివేత.

**ఆలయ ఈవో కే దామోదర్ రావు.**

**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఆగస్టు 23,**రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న శ్రీ స్వామివారి ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి పనుల్లో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే అంతరాలయ అభిషేక సేవను సెప్టెంబర్ 1, 2026 నుంచి అంతరంగికంగా మాత్రమే నిర్వహించనున్నారు. భక్తులకు అభిషేక దర్శనం వీక్షించే అవకాశం లేకపోవడంతో అంతరాలయ అభిషేక సేవను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



# కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి

- సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, కేటీఆర్ పిలుపు
- సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలు
- 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- 'బాకీ కార్డుల'తో హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కేటీఆర్
- గ్రామగ్రామాన ప్రజలకు కాంగ్రెస్ మోసాన్ని తెలియజెప్పాలి...పార్టీ శ్రేణులకు పిలుపు




అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి...వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి...తర్వాత అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు సమాజంలోని అన్ని రంగాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన మోసాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి చేరేలా ఈ వారం రోజుల కార్యక్రమాలను నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**100 రోజుల్లో అమలు చేస్తామన్న హామీలేవీ సంపూర్ణంగా నెరవేర్చలేదు**

రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు డిక్లరేషన్ల పేరుతో ప్రతి ఒక్క మాటను 100 రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ అన్నారు. అయితే 1000 రోజులు పూర్తయిన తర్వాత కూడా ఒక్కటంటే ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఆ పార్టీ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, అవినీతి, అరాచకాల పట్ల తెలంగాణ ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అన్నారు.

రాష్ట్ర ప్రజలను పట్టి పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా విధానాలు, వైఫల్యాలు, అవినీతి, అరాచకాలను ప్రజల ముందుంచాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో ప్రతి వర్గానికి అర్థమయ్యేలా వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి భారీ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమాలు కేవలం హామీల చుట్టూ కాకుండా.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు. ఆయా వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల తాలూకు బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువతకు ప్రతి నెలా ఇస్తామన్న ఆర్థిక సహాయం ఎంత మేరకు పేరుకుపోయిందో ఈ బాకీ కార్డుల ద్వారా ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతి ఒక్కరినీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి వర్గానికి ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలు, ఆయా వర్గాలకు రావాల్సిన ప్రయోజనాలు, బకాయిల వివరాలను ప్రజల ముందుంచాలని సూచించారు. విద్యార్థులకు రూ.12 వేల కోట్లకు పైగా ఫీజులు చెల్లించకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును అన్ని కాలేజీల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను ప్రజల్లో విస్తృతంగా చర్చకు తీసుకురావాలని సూచించారు. యువతకు ఏ విధంగా ఉద్యోగాలు ఇవ్వకుండా, హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందో ఇప్పటికే సరూర్‌నగర్‌లో నిర్వహించిన సభ, యువ సంగ్రామ సదస్సు ద్వారా ఎండగట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యానికి సంబంధించిన కార్యాచరణలో భాగంగా మరోసారి యువతకు కాంగ్రెస్ చేసిన మోసాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చిన ఆటో డ్రైవర్లు, ఆడబిడ్డలు, అన్నదాతలు, గిరిజనులు, దళితులు, బీసీలు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్క వర్గాన్ని ప్రత్యేకంగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాలని కేటీఆర్ సూచించారు. ఒకే తరహా కార్యక్రమాలకు పరిమితం కాకుండా ఆయా వర్గాల సమస్యలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించాలని అన్నారు. ఈ సందర్భంగా ఏడు రోజులపాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గాల్లో మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థులు, దళితులు, బీసీలు, గిరిజనులు తదితర వర్గాలను ప్రత్యేకంగా కలుస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. హామీలు మాత్రమే కాకుండా ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలను కూడా కార్యక్రమాల్లో ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు.

**హామీలతో పాటు 1000 రోజుల వైఫల్యాలనూ ఎండగట్టాలి**

కేవలం హామీలు అమలు కాలేదనే అంశానికే పరిమితం కాకుండా.. ఈ 1000 రోజుల్లో ప్రభుత్వం ఎన్ని రంగాల్లో వైఫల్యం చెందిందో, ఎన్ని రంగాల్లో అట్టర్‌ఫ్లాప్ పరిపాలన సాగించిందో ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలను గుర్తించి వాటిపై ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలని సూచించారు. "కేవలం హామీలు మాత్రమే కాదు.. వంద రోజుల వైఫల్య పాలన, వంద రోజుల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంత అట్టర్‌ఫ్లాప్ అయిందో కూడా మనం చాలా పెద్ద ఎత్తున లేవనెత్తాల్సిన అవసరం ఉంది" అని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, వాస్తవంగా జరిగిన పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కొత్త తరం పిల్లలకు చేరువయ్యేలా ఈ కార్యక్రమాలు ఉండాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియాపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు. సోషల్ మీడియాను ఒక పదునైన అస్త్రంగా ఉపయోగించుకుని వినూత్నమైన కార్యక్రమాలు, ప్రచార రూపాలతో కాంగ్రెస్ వైఫల్యాలను కొత్త తరానికి చేరేలా చేయాలని కోరారు.

వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు సహా అన్ని స్థాయిల నాయకులు పాల్గొనాలని కేటీఆర్ సూచించారు. ప్రతి నియోజకవర్గం, మండల కేంద్రం, గ్రామం, వార్డు స్థాయిలో పార్టీ శ్రేణులన్నీ కదిలి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాలను ఎంత వినూత్నంగా నిర్వహించగలిగితే అంత వినూత్నంగా నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచాలని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యేలా వివిధ రూపాల్లో, వినూత్నంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు తమ చాతుర్యాన్ని ఉపయోగించాలని కోరారు.

# ములుగులో మహిళా నాయకత్వానికి కష్టకాలమేనా.?




"ములుగు జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి భార్గవ్"

**ములుగు/భద్రాద్రి కొత్తగూడెం:**

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీ.ఆర్.ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో తన బలాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తుంది అని స్వరూప తెలిపారు అంతేకాకుండా ఈసారి నూతన నేతలను పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా కారు పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని అగ్రనాయకత్వం బాపు ఆలోచన సరైనదే" అదేవిధంగా ప్రస్తుతం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రాజకీయ వర్గాల్లో ఈ అంశంపై జోరుగా చర్చ సాగుతోంది..

బీ.ఆర్.ఎస్ పార్టీలోకి పలువురు కీలక నేతలు అడుగుపెట్టనున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత..? రాజకీయ వ్యూహమెంత..? అనేది మాత్రం అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. మా పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి మేమంతా ఏకభవిస్తాము అదేవిధంగా కెసిఆర్ బాపు ఏం చేసినా పార్టీ కోసం, ప్రజల కోసమే ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. అని స్వరూప తేటతెల్లన చేశారు.. నేతల చేరికలు నిజమైతే పార్టీకి క్షేత్రస్థాయిలో కొత్త ఊపు వస్తుందని లేక ఇప్పటికే ఉన్న నాయకత్వంలో కొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తాయని అనేది వేచి చూడాల్సిన అంశంగా మారింది...రాబోయే ఎన్నికల్లో బీ.ఆర్.ఎస్ తరఫున బరిలో నిలిచే ఎమ్మెల్యే అభ్యర్థి ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ సమస్యలపై నిరంతరం పోరాడే నాయకుడిగా ఉండాలనే ఆలోచన పార్టీ శ్రేణుల్లో ఉందనే చర్చ వినిపిస్తుందని ఆమె అన్నారు, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్ష పాత్రను బలంగా పోషిస్తూ అధికార పక్షానికి 'పక్కలో బల్లెం'లా నిలిచే నాయకత్వం కోసమే తామంతా ఎదురు చూస్తున్నాము అని తన అభిప్రాయాన్ని మీడియా ముందు స్వరూప వ్యక్తం చేశారు..అగ్రనేతల ఆహ్వానంతో బీ.ఆర్.ఎస్‌లోకి వచ్చే నాయకులకు భవిష్యత్తులో ఎలాంటి బాధ్యతలు దక్కనున్నాయి? పదవులు, హోదాల కోసం పార్టీలో అంతర్గత పోటీ మొదలవుతుందా? లేక వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తారా? అనే

ప్రశ్నలు రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారుతాయేమో అన్నట్లుగా ఆమె భావిస్తున్నారు..ములుగు జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ బీ.ఆర్.ఎస్ జెండాను బలంగా ఎగురవేయాలనే లక్ష్యంతో పార్టీ అధిష్ఠానం కొత్త రాజకీయ వ్యూహాలను రచిస్తోందనే ప్రచారం జరుగుతోంది. తండ్రి కె సి ఆర్-- తనయుడు మా అన్న కేటీఆర్ రాజకీయ వ్యూహంలో భాగంగానే కీలక నేతలను సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈసారి తెలంగాణ రాష్ట్రంతో పాటు ముఖ్యంగా భద్రాద్రి, ములుగు జిల్లాలలో కారు జెండా ఎగరేస్తాం అంటూ ముక్కంటాంగా స్వరూప మాట్లాడారు. ఈసారి కారు దే విజయం అనే చర్చ కూడా స్థానిక రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది...భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో పార్టీకి దూరంగా వ్యవహరించిన లేదా పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా పనిచేసిన నాయకులకు భవిష్యత్తులో మళ్లీ బీ.ఆర్.ఎస్‌లో స్థానం కల్పిస్తారా? సభ్యత్వం కొనసాగిస్తారా? అన్న ప్రశ్నలు కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారాయి...'తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టిన వారికి పార్టీ మరోసారి అవకాశం ఇస్తుందా..? లేక గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కఠిన నిర్ణయాలు తీసుకుంటుందా..?' అన్నది పార్టీ శ్రేణుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది...ములుగు జిల్లాలో ఇప్పటివరకు రాజకీయంగా తనదైన ముద్ర వేసుకున్న మహిళా నాయకత్వానికి రాబోయే ఎన్నికలు సవాల్‌గా మారుతాయి సెల్ఫీ రాజకీయాలకు ఇక చెక్ పడుతుంది అని విమర్శించారు..ఈసారి పరిస్థితులు అంత సులభంగా ఉండవని ప్రజల్లో చర్చ జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఎన్నికల సమయానికి ఏర్పడే రాజకీయ పొత్తులు, అభ్యర్థుల ఎంపిక, ప్రజా స్పందన, పార్టీ బలాబలాలు వంటి అంశాలే తుది ఫలితాలను నిర్ణయించనున్నాయి...ఒక పార్టీ బలం కేవలం కీలక నేతల చేరికలతోనే నిర్ణయించబడదని, క్షేత్రస్థాయిలో కార్యకర్తల బలం, ప్రజలతో ఉన్న అనుబంధం, స్థానిక సమస్యలపై పోరాటం, బలమైన నాయకత్వం వంటి అంశాలు కూడా కీలకమనే అదేవిధంగా రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. కొత్త నేతలను ఆహ్వానించడంతో పాటు పాత కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగితేనే బీ.ఆర్.ఎస్ రాజకీయంగా మరింత బలపడే అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది...మొత్తానికి.. నూతన నేతల చేరికలు, పాత నేతల సమన్వయం, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అంశాలతో బీ.ఆర్.ఎస్ పార్టీ మళ్లీ పుంజుకోవాలని పాలనలో మార్పు రావాలని భావించిన ప్రజలు మరల కెసిఆర్ బాపుని తెలంగాణ ప్రజలే ఆరతి ఇచ్చి ఆహ్వానిస్తారని స్వరూప తేల్చి చెప్పేసారు...